## క్లుప్తంగా

### రైతులు అధైర్యపడొద్దు: కలెక్టర్

హన్వాడ: సాంకేతిక కారణాలతో రుణమాఫీ కానీ రైతులు అధైర్యపడొద్దని కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. గురువారం ఆమె మండల కేంద్రంలో పర్యటించారు. రుణమాఫీ కాని రైతులకు రైతువేదికలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌ను పరిశీలించారు. ఆధార్, బ్యాంకు ఖాతాల్లో పొరపాట్ల కారణంగా రుణమాఫీ కానీ రైతులు తమ వివరాలకు సరిపోలిన పత్రాలను సమర్పిస్తే వారికి రుణమాఫీ వస్తుందన్నారు. అధికారులు రైతుల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఎస్‌బీఐ సందర్శించి మేనేజర్‌తో మాట్లాడారు. అనంతరం స్థానిక కేజీబీవీలో మొక్కలు నాటారు.

**పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించండి**

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను తక్షణం పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిరబోయి తహసీల్దార్లకు ఆదేశించారు. ధరణి, ప్రజావాణి, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ తదితర అంశాలపై గురువారం కలెక్టరేట్‌లో వీసీ నిర్వహించారు. ధ్రువపత్రాలు, ఆధారాలు అవసరమైన కేసుల్లో తప్ప పెండింగ్‌లో ఉన్న అన్నింటిని వెంటవెంటనే పరిష్కరించాలన్నారు. వచ్చే వారం నుంచి అసైన్డ్, భూదాన్ భూములు, ఆన్ సెటిల్మెంట్ ఇనాం భూములపై సమీక్షించడం జరుగుతుందని వాటన్నింటికీ సంబంధించిన సమాచారాన్ని సిద్ధం చేసుకోవాలన్నారు.

### వృద్ధాశ్రమాన్ని సందర్శించిన జడ్జి

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని ఓబ్లాయిపల్లి రామకృష్ణ వృద్ధాశ్రమాన్ని జిల్లా మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి నిహారిక జుట్బూర్ గురువారం సందర్శించారు. ఆహారం, నీరు, వసతి, సౌకర్యాలపై ఆరా తీశారు. అదేవిధంగా వృద్ధులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధాశ్రమంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.

### ముగిసిన ఆరాధనోత్సవాలు



జడ్చర్ల టౌన్: పట్టణంలోని రాఘవేంద్రస్వామి మఠంలో 353వ ఆరాధనోత్సవాలు గురువారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామికి సుప్రభాత పారాయణం, పాదపూజ, కనకాభిషేకం, పంచామృత అభిషేకం, వస్త్ర సహిత పుష్పాలంకరణ, రథోత్సవం, తులసి అర్చన, స్వస్తి వచనం, అలంకరణ చేశారు. రాఘవేంద్రస్వామి, హనుమాన్ చాలీసా పారాయణం, భక్తిప్రవచనాలు, భక్తిగేయాలు, భజనలు మార్మోగాయి.

### సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

చిన్నచింతకుంట: మండలంలోని ఉంద్యాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులు నడుం బిగించారు. రూ.లక్ష విరాళాలు సేకరించి గురువారం ఎస్‌ఐ శేఖర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు కాకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మోహిన్, లక్ష్మన్, జైపాల్‌రెడ్డి, శేఖర్ పలువురు ఉన్నారు.

### విద్యార్థులకు క్విజ్ పోటీలు

నవాబుపేట: ఇండియన్ నేషనల్ ఆర్ట్, కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని జెడ్పీహెచ్ పాఠశాలలకు గురువారం క్విజ్ పోటీలు నిర్వహించినట్లు ట్రస్ సభ్యులు నాగ్యనాయక్, గోపాల్‌రెడ్డి తెలిపారు. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలపై జరిగిన పోటీలలో 12 పాఠశాలలు పాల్గొనగా కుచూర్ పాఠశాల మొదటి బహుమతి సాధించింది.

### కారుకొండలో ఫీవర్ సర్వే

నవాబుపేట: మండలంలోని కారుకొండలో గురువారం వైద్యాధికారుల బృందం ఫీవర్ సర్వే చేపట్టింది. గ్రామానికి చెందిన సల్మాన్ బుధవారం జ్వరంతో జిల్లా ఆస్పత్రిలో చేరాడు. గురువారం అతనికి డెంగీ సోకిందని వైద్యులు చెప్పటంతో మండల అధికారులు అప్రమత్తమై గ్రామానికి చేరుకున్నారు. బాధితుడి ఇంటితో పాటు గ్రామం మొత్తం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. అలాగే వైద్య సిబ్బంది సర్వే చేసి దోమల నివారణ చర్యలు, పరిశుభ్రతపై వారికి అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది శ్రీజా, శ్రీనివాస్, శరభలింగం, భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

### ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్ల నమోదు చేయండి

గండేడ్: కొత్త ఓటర్ల నమోదులో భాగంగా బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటింటికీ వెళ్లాలని ఎల్‌ఎంటీలు రాజేష్ రాథోడ్, శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం మండల తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 20 నుంచి అక్టోబర్ 18 వరకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఇందులో భాగంగా చిరునామా మార్పు, తప్పులు, సవరణలు వంటివి చేపడుతున్నట్లు తెలిపారు. వచ్చే నెల 29 వరకు ముసాయిదా జాబితాను ప్రకటిస్తామన్నారు. అభ్యంతరాలు ఉంటే నవంబరు 28 వరకు స్వీకరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగలక్ష్మి, డీటీ మాధవి, ఆర్‌ఐలు యాసిన్, ఫయాజ్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

# రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం



దేవరకద్రలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



జడ్చర్లలో మాట్లాడుతున్న రజనీసాయిచంద్

దేవరకద్ర: ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వంతెన కింద బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో మాట్లాడారు. రుణమాఫీపై కాంగ్రెస్ మంత్రులే తలో మాటా మాట్లాడుతూ లెక్కలు చెబుతున్నారని విమర్శించారు. ఇంకా 17 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయాలని మంత్రి ఉత్తమ్ అంటుండగా, మరో రూ.12 వేల కోట్లు రైతులకు రుణమాఫీ కింద ఇవ్వాలని మంత్రి పొంగలేటి అంటున్నారని ఆరోపించారు. ఇక భట్టి విక్రమార్క ఓ సారి రూ.31వేల కోట్లని, బ్యాంకర్ల సమావేశంలో రూ.7,500 కోట్లని చెప్పారన్నారు. రాష్ట్రంలో 42 లక్షల మంది రైతులకు రూ.31వేల కోట్లు రుణమాఫీ చేయాలని మంత్రి తుమ్మల చెప్పారని, ఇప్పటి వరకు 22లక్షల మందికి రూ.17వేల కోట్లు మాఫీ చేశామన్నారని ఇలా మంత్రులు ఎవరికి వారు లెక్కలు చెప్పి రైతులను అయోమయానికి గురి చేస్తున్నారని అన్నారు. గతంలో పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో చెరువులు, కుంటలు, చెక్ డ్యాంలను నింపి సాగునీటికి కొరత లేకుండా చేశామని, కాంగ్రెస్ ప్రభుత్వం నది జలాలను వినియోగించుకోలేని పరిస్థితిని దాపురించిందని విమర్శించారు. తహసీల్దార్ కార్యాలయం వరకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో శ్రీధర్‌రెడ్డి, విశ్వేశ్వర్, జట్టి నర్సింహారెడ్డి, బస్వరాజు, గుంతమౌనిక, శ్రీకాంత్ యాదవ్, నరేందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు వేరు ఇప్పుడు చేస్తున్న విధానాలు వేరని మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పెంట్యానాయక్, బిక్షపతి తెలిపారు. కార్యక్రమంలో కిష్టయ్య, బాలవర్ధన్‌రెడ్డి, రఘు, గోపాల్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: రైతులందరికి రుణమాఫీ వెంటనే చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, నర్సింహులు, లక్ష్మయ్య, ప్రతాప్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

### అరకొర రుణమాఫీ

జడ్చర్ల: ఎన్నికల సమయంలో రూ.2లక్షలు రుణం తీసుకున్న ప్రతి రైతుకు మాఫీ చేస్తామని ప్రకటించి గెలిచి గద్దెనెక్కిన తర్వాత ఆంక్షలు పెట్టి అరకొరగా మాఫీ చేస్తున్నారని రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజనీసాయిచంద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందినా వ్యక్తి అయినా.. జిల్లాకు ఒరిగిందేమీ లేదన్నారు. తమ నేతలను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని, ప్రజా సంక్షేమాన్ని విస్మరించారని మండిపడ్డారు. అనంతరం సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు.

మిడ్జిల్: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో జడ్చర్ల –కల్వకుర్తి ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో పాండుయాదవ్, సుదర్శన్, బాలు, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా యావలమ్మ బోనాలు

రాజాపూర్ (బాలనగర్): మండల కేంద్రంలో యావలమ్మ బోనాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు, డీజే నృత్యాలు అలరించాయి. దీంతో పాటు మహిళలు ప్రత్యేకంగా అలంకరించిన బోనాలు ఊరేగించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

**రాజాపూర్‌లో..**

మండల కేంద్రంలో గురువారం బంగారు మైసమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతకు ప్రదక్షిణ చేసి మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు.



బాలానగర్‌లో యావలమ్మ బోనాలలో పోతురాజుల విన్యాసాలు

# ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రజలంతా సుఖసంతోషాలతో, కలసిమెలసి జీవించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక 9వ వార్డు పరిధిలోని పాల్కొండతండాలో పర్వత సంజీవరాయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు అర్చకులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. వేద ఆశీర్వాదం అందించి తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రఘునాయక్, సుధాకర్‌రెడ్డి, ఫకీరానాయక్, బలరాంనాయక్, గోవింద్‌నాయక్, ఖాజానాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఉద్యోగులకు శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వహించే బ్లాక్ డేను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం జిల్లా ట్రెజరీ కార్యాలయంలో ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పుడు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసుకునే మంచి అవకాశం ఉన్నప్పటికి, అప్పటి ప్రభుత్వం కనీసం ఉద్యోగ సంఘాలతో చర్చించకుండా ఏకపక్షంగా జీఓ 28ని తెచ్చిందని విమర్శించారు. 2014 ఆగస్టు 23వ తేదీన సీపీఎస్‌ను కొనసాగిస్తామని జీఓ తెచ్చారని, అందుకు సీపీఎస్ ఉద్యోగులు బ్లాక్‌డేగా పాటిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో 1.20లక్షల మంది ఉద్యోగులకు శాపంగా మారిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పాత పెన్షన్‌ను పునరుద్ధరిస్తామని ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో సీపీఎస్ ఉద్యోగుల ఆధ్వర్యంలో నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మల్లేష్, కార్తీక్, కృష్ణకుమార్‌గౌడ్, రాజేష్, వెంకటేష్, గోవర్ధన్ పాల్గొన్నారు.




ఉద్యోగులతో సమావేశమైన సంఘం నాయకులు

# మొక్కలను నాటి సంరక్షించాలి



మహమ్మదాబాద్‌లో మొక్కలు నాటుతున్న అధికారులు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'నాటుదాం ఒక చెట్టు, అమ్మ పేరు మీద' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల ఆవరణలో అధికారులు, మహిళా సంఘాల సభ్యులు మొక్కలు నాటారు. మొక్కలు నాటి సంరక్షిస్తేనే భావితరాలకు భవిష్యత్ ఉంటుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ శివప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ అనురాధ, ఎంఈఓ రాజేశ్వర్‌రెడ్డి, ఏపీఓ పులేందర్, మహిళా సంఘాల సభ్యులు తదితరులు ఉన్నారు.

మహమ్మదాబాద్: నాటే ప్రతి మొక్కను అమ్మపేరున బతికిద్దామని ఎంపీడీఓ దేవన్న తెలిపారు. గురువారం మహమ్మదాబాద్, జూలపల్లి, నంచర్లలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అమ్మ పేరున మొక్క నాటి బతికించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ హర్చింద్రుడు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# హాస్టళ్లను తనిఖీ చేసిన ప్రత్యేక బృందాలు

మహమ్మదాబాద్: హాస్టళ్లలో నాణ్యత లోపించిందన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని నంచర్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, నంచర్ల ఎస్సీ ఆనంద నిలయం వసతి గృహాలను ప్రత్యేక బృందాలు తనిఖీ చేశాయి. గురుకుల పాఠశాలను ఎంపీడీఓ దేవన్న బృందం, ఆనంద నిలయంలో గండేడ్ తహసీల్దార్ నాగలక్ష్మి బృందం తనిఖీ చేశారు. విద్యార్థుల స్నానపు గదులు, బాత్‌రూం సౌకర్యాలు ఎలా ఉన్నాయి. విద్యార్థినుల రూములు, డైనింగ్ హాల్, పాత్రల పరిశుభ్రత పరికరాలు వసతులపై ఆరా తీశారు. నంచర్ల గురుకులంలో నీళ్లు సరిపోవడం లేదని, బాత్‌రూం సౌకర్యాలు సరిగా లేవని, అన్నంలో పురుగులు వస్తున్నాయని, ఉదయం తొందరగా అన్నం పెట్టడంతో జీర్ణం సరిగ్గా కావడంలేదని విద్యార్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

గండేడ్: మండలంలోని వెన్నాచేడ్ మోడల్ స్కూల్ వసతి గృహాన్ని మండల స్పెషల్ టీం సందర్శించింది. టీం లీడర్ ఎంపీఈఓ నరేందర్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లమ్మ గురువారం పరిసరాల శుభ్రత, పిల్లల ఆరోగ్యం, సురక్షిత తాగునీరు, పౌష్టికాహారం, డైనింగ్ హాల్, వంటగది తదితర అంశాలపై వివరాలను విద్యార్థులతో తెలుసుకున్నారు.

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌ను గురువారం సాయంత్రం తహసీల్దార్ బ్రహ్మంగౌడ్, ఇన్‌చార్జి ఎంపీడీఓ శివప్రసాద్ తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలను అధికారులు పరిశీలించి విద్యార్థులతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గిర్దావర్ రవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనసూయ, వార్డెన్ యాదయ్య, కార్యదర్శి మహేందర్ ఉన్నారు.



నంచర్ల ఆనందనిలయంలో వంట సామగ్రి పరిశీలిస్తున్న అధికారులు

### టవర్‌కు విద్యుత్ నిలిపివేత

చిన్నచింతకుంట: మండలంలోని అప్పంపల్లిలో ఉన్న ఓ మొబైల్ సిగ్నల్ టవర్‌కు పంచాయతీ కార్యదర్శి మమత, సిబ్బందితో కలిసి గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఆమె మాట్లాడుతూ టవర్ నిర్వాహకులు పంచాయతీకి చెల్లించాల్సిన పన్ను మూడేళ్లుగా చెల్లించడం లేదన్నారు. పన్ను చెల్లించాలని నోటీసులు అందించిన స్పందించలేదని, అందుకు టవర్‌కు విద్యుత్ సరఫరాను నిలిపివేసినట్లు పేర్కొన్నారు.

### బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

రాజాపూర్: మండల కేంద్రంలో గురువారం మల్లేపల్లికి చెందిన వెంకటయ్య రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొనడంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఎక్స్‌రోడ్డులో స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

### దుకాణంలో చోరీ



దేవరకద్ర: మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న దుస్తులు అమ్మే దుకాణంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. షాపు యజమాని సయ్యద్ ఆవేజ్ బుధవారం రాత్రి దుకాణానికి తాళం వేసి వెళ్లాడు. గురువారం ఉదయం వచ్చి తెరువగా వెనక వైపున రేకులను కత్తిరించి పెద్దగా రంధ్రం చేసి దొంగలు లోపలికి దూరినట్లు కనిపించిందని బాధితుడు తెలిపాడు. రూ.15 వేల నగదు, కొన్ని జతల కొత్త దుస్తులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు. ఘటనా స్థలానికి ఎస్‌ఐ నాగన్న చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### విద్యుదాఘాతంతో మేక మృతి

మహమ్మదాబాద్: మండలంలోని మంగంపేట్‌తండాలో సునీల్‌కు చెందిన మేక మేత మేసుకుంటూ పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్ శాఖ వారు స్పందించి ఆర్థికసాయం అందించాలని కోరాడు.

### భార్య కనిపించడం లేదని ఫిర్యాదు

అడ్డాకుల: మండలంలోని తిమ్మాయిపల్లితండాకు చెందిన వివాహిత కనిపించడం లేదని భర్త ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. తండాకు చెందిన కెతావత్ హన్మంతు, దేవి భార్యభర్తలు. ఈనెల 14న హన్మంతు పని మీద కొత్తకోటకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చాడు. ఆయన భార్య దేవి ఇంట్లో కనిపించలేదు. ఆచూకీ లభించకపోవడంతో గురువారం ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

### బాలికపై దాడి ఘటనలో పురోగతి శూన్యం

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలోని శ్రీనివాస కాలనీలో బాలికను గొంతు కోసిన ఘటనపై కారకులు ఎవరూ అనేది ఇంకా తెలియరాలేదు. గురువారం ఈ కేసులో ఎలాంటి పురోగతి లభించలేదు. స్థానికంగా ఇళ్లలో ఉన్న అన్ని రకాల సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించిన ఎలాంటి ఆధారం లభించలేదు. దాడి జరిగిన సమయంలో ఆ బాలిక ఇంటి వైపు ఎలాంటి వాహనాలు వెళ్లలేదని, అనుమానాస్పద వ్యక్తులు కూడా తిరగలేదని, ఆటో మాత్రమే వచ్చిందని.. డ్రైవర్‌ను విచారణ చేయగా అదే ఆటోలో ఆ బాలికను ఆస్పత్రికి తీసుకువెళ్లడం జరిగిందని డీఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. బాలిక పార్కు నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలో వెనుక వెళ్లడం, మాట్లాడటం వంటి దృశ్యాలు ఎక్కడా కన్పించలేదని తెలిపారు. బాలిక మాట్లాడితే కొన్ని వివరాలు తెలిసే అవకాశం ఉందని, ఈ ఘటనపై ఇంకా లోతైనా విచారణ చేస్తామని డీఎస్పీ తెలిపారు.

# రాజాబహదూర్ వెంకట్రాంరెడ్డికి నివాళి



జిల్లా కేంద్రంలో నివాళులర్పిస్తున్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: రాజా బహదూర్ వెంకట్రాంరెడ్డి కులమతాలకతీతంగా విద్యారంగ వ్యాప్తి కోసం కృషి చేశారని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. పాలమూరు రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో రాజాబహదూర్ వెంకట్రాంరెడ్డి జయంతి నిర్వహించారు. స్థానిక పద్మావతికాలనీలోగల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చైర్మన్ మాట్లాడుతూ రాజా బహదూర్ వెంకట్రాంరెడ్డి హాస్టళ్లు ఏర్పాటు చేసి ఎందరికో భవిష్యత్‌కు బంగారు బాటలు వేశారన్నారు. కార్యక్రమంలో తూము ఇంద్రసేనారెడ్డి, రాజేందర్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, సురేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాజాబహదూర్ వెంకట్రాంరెడ్డి సేవలు మరువలేనివని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన జయంతి సందర్భంగా స్థానిక పద్మావతి కాలనీలో ఉన్న విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, శివరాజు, అనంతరెడ్డి, గిరిధర్, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



రాజాబహదూర్‌కు నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# రోడ్డుపై చెత్త వేసినందుకు నోటీసులు



టీడీగుట్ట ప్రాంతంలోని స్క్రాప్ దుకాణాన్ని సీజ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక టీడీగుట్ట ప్రాంతంలోని ఓ స్క్రాప్ దుకాణం నిర్వాహకుడు రోడ్డుపైనే పాత ఇనుప సామగ్రి, ప్లాస్టిక్, ఇతర వస్తువులను వేయడంతో స్థానికులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ విషయమై గతంలో వారు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించి పలుమార్లు నోటీసులు అందజేసినా నిర్వాహకులు పట్టించుకోలేదు. ఈ విషయం కలెక్టర్ విజయేందిర బోయి దృష్టికి వెళ్లింది. చివరకు కలెక్టర ఆదేశాల మేరకు గురువారం దుకాణాన్ని మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. అలాగే స్వచ్ఛ ఆటోకు చెత్త ఇవ్వకుండా ఎక్కడబడితే అక్కడ వేస్తున్న ఎంబీసీ కాంప్లెక్స్‌లోని ఐదు షాపుల యజమానులకు నోటీసులు అందజేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గురులింగం, వజ్రకుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# మున్సిపల్ కార్మికులకు హక్కులు వర్తించవా?

జడ్చర్ల టౌన్: మున్సిపల్ కార్మికులు అంటే మనుషులు కాదా వారికి రాజ్యాంగం కల్పించిన హక్కులు వర్తించవా అంటూ సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య ప్రశ్నించారు. పట్టణంలోని అంబేద్కర్ కళాభవన్ వద్ద మున్సిపల్ కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని చేపట్టిన నిరసనకు ఆయన మద్దతు పలికి ప్రసంగించారు. విధుల్లో పాల్గొంటూనే 17రోజులుగా తమ నిరసనలు వ్యక్తం చేస్తున్నా అధికారులు స్పందించకపోవటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు, కార్మిక నాయకులపై కక్షకట్టి అసత్యపు ప్రచారం చేస్తున్న కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, కేశవులు, అంజమ్మ, దేవమ్మ, యాదయ్య, మహేష్, స్వరూప, భీమమ్మ, మొగులమ్మ, లక్ష్మి, జంగమ్మ, జయమ్మ, వినోద పాల్గొన్నారు.

కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని స్థానిక కమిషనర్ రాజయ్యపై మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రటరి దానం కిషోర్‌కు గురువారం ఫిర్యాదు చేసినట్లు మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ తెలియజేశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో తమ రాష్ట్ర నాయకుల సమక్షంలో సమస్యలు విన్నవించినట్లు తెలిపారు.



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

### షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి




నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నాయకులు

హన్వాడ: రైతులకు షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని రైతు సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మయ్య డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రుణాలు పొందిన రైతులందరికీ మాఫీ చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ కిష్టునాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రాములు, బాల్‌రెడ్డి, రవి, వెంకట్రాములు, బాలయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

### పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలి

భూత్పూర్: పరిసరాల పరిశుభ్రతపై అధికారులు దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ సూచించారు. గురువారం 2వ వార్డు శేరిపల్లి(బి)లో ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఆవరణ అపరిశుభ్రంగా ఉండడంతో హెచ్‌ఎంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు పెరగడం, మూత్రశాలలు శుభ్రంగా లేకపోవడంపై మండిపడ్డారు. పాఠశాల అనంతరం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు సంబంధించిన ప్లాట్లు, వెంచర్‌ను ఆయన పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

### సినీనటుడు చిరంజీవి జన్మదిన వేడుకలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో గురువారం సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకలను నిర్వహించారు. నటరాజ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బస్టాండ్ ఎదురుగా ఉన్న షిరిడిసాయిబాబా ఆలయంలో 80 మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అదే విధంగా 300 మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ శశికాంత్, అశోక్‌కుమార్, లయన్స్ క్లబ్ మహబూబ్‌నగర్ అధ్యక్షుడు ప్రసాద్, బాల్‌రాజు, గిరిప్రసాద్, రాములు, సుదర్శన్ యాదవ్, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: సినీనటుడు చిరంజీవి జన్మదినం పురస్కరించుకుని గురువారం పట్టణంలోని నేతాజీ చౌరస్తాలో చిరంజీవి సేవాసమితి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. కార్యక్రమంలో సత్యం, అమరవాది ప్రభు, రామస్వామి, ప్రకాష్, మధు, కుర్మయ్య, సాయి, బాలు, శేఖర్ పాల్గొన్నారు.